

# రుణానుబంధ రూపేణా...

**- పి.వి.డి.ఎస్.ప్రకాష్**

"గుళ్లో పంతులుగారు స్వయంపాకం తీసుకుంటానన్నారు. వీలు కుదరనపుడు ఇలా స్వయంపాకం ఇవ్వడంలో తప్పేం లేదని అప్పట్లో తద్దినం బ్రాహ్మడే చెప్పాడుగా. కొత్తగా ఈ ఊరొచ్చిపడ్డాం. ఎవరెవరో అసలు తెలీదుగా. అందుకే, ఈసారికి ఇలా కానిచ్చేద్దాం" చెబుతోంది రాజేశ్వరి.

"స్వయంపాకమా...?" వినకూడనిమాటేదో విన్నట్లు ముఖం పెట్టాను.

"అవును స్వయంపాకమే. ఓ పళ్లెం నిండుగా బియ్యం, కూరగాయలు, పప్పు, ఉప్పు, ఇంత నెయ్యి, చింతపండు... అన్నీ ఇద్దాం. అలాగే... బజారుకెళ్లి మామిడిపళ్లు కూడా తీసుకురండి. అవంటే మామగారికెంతో ఇష్టం. వాటిని కూడా పంతులుగారికిద్దాం. చక్కగా తింటారు" చెబుతోందామె.

ఆలోచిస్తూ పడక్కుర్చీలో కూర్చున్నాను.

"ఏం మాట్లాడరూ..."

"ఏం మాట్లాడను. తిథి ఇంకా రెండ్రోజులుంది కదా. కనీసం కాళ్లు కడిగి అయినా, ఇద్దరు భోక్తలకు భోజనం పెట్టాలనుకుంటున్నాను..."

"సరే, మీమాటెందుకు నేకాదనాలి. భోక్తలు దొరికితే అలాగే పెడదాం. ఎందుకైనా మంచిదని పొద్దున్నే రామాలయానికి వెళ్లి పంతులుగారిని కలిసాను. అర్చక వృత్తిలో ఉన్నారుగా... తద్దినం భోజనాలకు ఇళ్లకు రారట. గుళ్లోకొచ్చి స్వయంపాకం ఇస్తే తీసుకోడానికేం అభ్యంతరం లేదని చెప్పారాయన. ఆమాటే మీకు చెప్తానంటూ వచ్చేసాను..." చెబుతోంది తను.

నాన్నగారి తద్దినం వస్తుందంటే చాలు గుండె బరువెక్కుతుంది. ఆయన జ్ఞాపకాలతో మనసంతా నిండిపోతుంది. చిన్నతనంలో తడబడే అడుగులను సరిదిద్దిందీ ఆయనే. పెద్దయ్యాక తప్పటడుగులు వేయకుండా పహరా కాసిందీ ఆయనే. ఎప్పటికీ నాన్నే నా ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్. ఇప్పటికీ చిన్నపాటి ఆనందంలోనూ, ఎదపట్టని విషాదంలోనూ మొదటగా తలచుకునేది నాన్ననే. చిన్నతనంలోనే అమ్మ చనిపోతే... నాన్నే అమ్మ అయ్యాడు. నాన్న అయ్యాడు. గురువయ్యాడు. దైవమయ్యాడు.

అవును, ఇపుడు కనిపించని దేముడే అయ్యాడు.

నాన్న గుర్తుకురాగానే నా రెండు కళ్లూ ఒక్కసారి చెమర్చాయి.

నడకలో, నడతలో నాన్ననే అనుకరించేవాణ్ణి. చిన్నతనంలో నాన్న బజారునుంచీ వచ్చి గుమ్మంలో చెప్పులు విడవడం ఆలస్యం... గబగబా వెళ్లి ఆ చెప్పుల్లో కాళ్లు దూర్చేసి... ఆయనలా నడిచేందుకు ప్రయత్నించేవాడిని. అవేమో, పెద్ద చెప్పులు... నావేమో చిట్టి పాదాలు. దాంతో, నడవలేక సతమతమై, అడుగులు తడబడి పడబోతుంటే... అపుడు నాన్నే కిందపడకుండా రెండు చేతుల్తో ఆపి, నన్ను పొదివి పట్టుకుని, ఎత్తుకుని ముద్దుల్తో ముంచేసేవాడు.

"ముద్దులు పెట్టకు నాన్నా. నీ మీసాలు గుచ్చుకుంటున్నాయి..." అని నేనంటే ఏమనుకున్నాడో ఏమో గానీ... అద్దంముందు కూర్చుని బ్లేడుతో మీసాలు పరపరా గీసేసాడు నాన్న. మీసాలు లేకుండా నాన్న కొత్త మనిషిలా కనిపించాడు. వెక్కిరిస్తూనే నవ్వుతుంటే తానూ నవ్వుతూనే ముద్దాడుతూ... "ఇప్పుడు నొప్పి లేదుగా..." గారంగా అడిగేవాడు.

ఆ బాల్యం... అలా ముద్దులు పంచిన నాన్నని తలచుకున్నపుడల్లా నా కళ్లు జలజలా పారే సెలయేళ్లే అవుతాయి.

ఆ నాన్న గుండెలపై నే ఆడుకున్నాను. ఆయన ఒళ్లో తల పెట్టుకుని పడుకున్నాను. ఆయన కళ్లతోనే లోకాన్ని చూసాను. ఆయన అడుగులో అడుగేస్తూ ఈ లోకంలో తిరిగాను. అలాటి నాన్న లేడని ఇన్నేళ్లయినా ఇప్పటికీ నమ్మబుద్ధికావడం లేదు. మా నాన్న బతికున్ననాళ్లూ దర్జాగా బతికాడు. ఆయన చెయ్యెపుడూ పైనే ఉండేది. పొరపాటున కూడా కిందుండేది కాదు. ఈ లోకానికి కడసారి వీడ్కోలు పలికేదాకా... తన తిండి తానే తిన్నాడు. కనీసం ఒక్కగానొక్క కొడుకునైన నా దగ్గర ఉండేందుకు ఎప్పుడూ ఇష్టపడలేదు.

"నాతో రా నాన్నా... అందరం కలిసుందాం..."అని ఎంత చెప్పినా వినిపించుకోలేదు.

వద్దని చెబుతూనే తన వాదన వినిపించేవాడు.

"ముప్ఫయ్యేళ్లుగా చేసిన బడి పంతులుద్యోగాన్ని మెచ్చి గవర్నమెంట్, చచ్చేదాకా బతకమంటూ పెన్షన్ కూడా ఇస్తోంది. ఆ డబ్బుతో నెలంతా నేను తినడమే కాదు, మరో ఇద్దరికి పెట్టగలను. తల దాచుకునేందుకా, ఇదిగో... ఈ కొంప ఉంది. కాళ్లు చేతులు, కళ్ళూ భేషుగ్గా పనిచేస్తున్నాయి. కన్నకొడుకువైనా... నీదగ్గరెందుకుండాల్రా...? పైగా, నువ్వూ ఒంటరివి కావు. ఓ ఇంటివాడివి. నీ బాధ్యతలు నీకుంటాయిగా... నేనూ నీకు భారమవ్వాలా?" ఆయన చెప్తుంటే చూపు తిప్పుకోకుండా ఆయనవేపే చూస్తున్నాను.

"ఒకవేళ వయసే పెద్దపులిలా పంజా విసిరితే... ఏ డాక్టర్ దగ్గరకైనా వెళ్లి డబ్బిచ్చి మరీ చావనైనా చస్తానుగానీ... ఒకళ్ల దగ్గర చస్తే ఉండను. ఉండలేను...?" ఖరాఖండిగా చెప్పేవాడాయన. చెప్పడమే కాదు, అంత ఖచ్చితంగానే బతుకు వెళ్లదీసాడు. అతిథిలా వచ్చి ఓ పూట విస్తరి వేసేవాడే కానీ... రోజుల తరబడీ తిష్టవేసేవాడు కాడు. ఉండమన్నా... "నే పెరిగిన వాతావరణం వేరు. నా అలవాట్లు వేరు. నేనిక్కడ ఉంటే మీ అందరికీ ఇబ్బందే..." అంటూ పొద్దునొచ్చి సాయంత్రానికి పెట్టె పట్టుకుని రైలెక్కేసేవాడు. అలాటి తండ్రి తద్దినం ఏడాదికోసారి వస్తే ఓ ఇద్దరు బ్రాహ్మలను పిలిచి... మంత్రం చెప్పి, కాళ్లు కడిగి... కడుపునిండా భోజనం పెట్టలేడా తను? ఆ బ్రాహ్మలు విస్తట్లో ఏ ఒక్కటి మిగల్చకుండా తింటుంటే... వాళ్ల కళ్లల్లో తండ్రిని చూసుకోవడం నాకెంతో ఇష్టం. తండ్రి పోయిన ఈ అయిదేళ్లలో ఆ కార్యక్రమానికి ఎలాటి అవాంతరం రాలేదు. స్వయంపాకం ఇవ్వాల్సిన అగత్యం రాలేదు. ఇదిగో, ఇపుడే సడన్‌గా బదిలీ అయి ఈ కొత్త ఊరు రావడంతో సమస్య తలెత్తింది. రెండ్రోజుల క్రితమే ఈ ఇంట్లో దిగి సామాన్లు సర్దిన బడలికే తీరలేదు... అంతలోనే వాకిట్లోకి వచ్చేసింది నాన్నగారి ఆబ్దికం. ధాంతో, హడావుడిగా బ్రాహ్మలకోసం ఆరా తీయడం ప్రారంభించాను. ఇరుగుపొరుగు చెప్పిన సమాచారం మేరకు ఇద్దర్ని కలిస్తే... వాళ్లకి కుదరలేదు.

ఇంతలో, శ్రీమతి గుళ్లో పంతుల్ని కలిసి ఈ కబురు మోసుకొచ్చింది.

"అన్నట్టు మీకో సంగతి చెప్పాలనుకుంటూనే మరిచిపోయాను. ఆ గుడి పూజారి అచ్చం మామగారిలాగే ఉన్నారు. మనిషిని పోలిన మనుషులుంటారని విన్నానుగానీ... ఇంతలా అచ్చుగుద్దినట్లుండడం ఇంత వరకూ నే చూడలేదంటే నమ్మండి..."

"అవునా...?" వింటుంటే నాకూ ఆశ్చర్యం కలుగుతోంది.

"ఆ విషయం ఇపుడా చెప్పేది?"

"ఇపుడైనా చెప్తున్నానుగా... వినండి" అంది రాజేశ్వరి కాస్త విసుగ్గా.

"ఇంకా గుడి తీసే ఉంటుందా?" వీలైనంత త్వరగా ఆయన్ని చూడాలనుంది.

"మీకు తెలీదేమిటి? ఎనిమిదింటికే అన్ని గుళ్లూ మూసేస్తారు... ఎల్లుండెలాగో స్వయంపాకం ఇచ్చేందుకు వెళ్లాలి కదా... అపుడే చూడొచ్చులెండి..." శ్రీమతి అంటోంది.

చేసేదేం లేక... "సరే..."అంటూ జ్ఞాపకాల్లోకి జారిపోయాను.

ఓసారి-

నాన్న ఒంట్లో బాగోలేదనే కబురందింది.

అపుడు నేను కోరాపుట్లో పనిచేస్తున్నాను. సెలవు పెట్టుకుని నాన్నని చూసేందుకు హుటాహుటిన వెళ్శాను. అప్పటికే వయోభారంతో నాన్న సగమయ్యాడు. అస్తిపంజరానికి ఎర్రతోలు తొడిగినట్లున్నాడు. అయినా, పెదవులపై అదే చిర్నవ్వు.

"ఏంటి విశేషాలు?" అడిగాను దగ్గరగా కూర్చొని. నాన్న నా తలపై చేయి వేసాడు దీవిస్తున్నట్లు. తర్వాత అలసిపోయేదాకా కబుర్లెన్నో చెప్పాడు. వింటూ నాన్న ఒడిలో పడుకున్నాను.

"వాల్మీకి రామాయణం నిత్యపారాయణం చేస్తున్నాను. నూటపదహారుసార్లు చేయాలనీ కోరిక. ఇప్పటికైతే తొంభై రెండోసారి చదవడం పూర్తయింది. నా సంకల్పం పూర్తయి, నూటపదహారుసార్లు చదవగానే స్వయంగా శ్రీరామపట్టాభిషేకం చేయాలనుకుంటున్నాను. నా స్నేహితులు కొందరు ఈ విషయంలో నాకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారు కూడా..." ఆ మాటలంటున్నపుడు నాన్నలో రామదాసే కనిపించాడు.

"రామాయణం చదవడంలో మునిగిపోయి వేళకి తిండి తినడం లేదనుకుంటా. ఎలా చిక్కిపోయావో?" అన్నాను ప్రేమగా.

"శ్రీరాముడికి నైవేద్యం పెట్టి ప్రసాదం తింటున్నానుగా..." చెప్పాడు నాన్న.

తెల్లవారకముందే లేవడం, సజ్జ పట్టుకుని పెరట్లో ఇన్ని పూలు కోయడం, తలారా స్నానంచేసి మడికట్టుకుని రాముడి పటం ముందు కూర్చుని రామాయణం చకచకా చదివేయడం... ఆఖరి రోజుల్లోనే చూసిన నాన్న దినచర్య అదీ. తలపెట్టిన రామాయణ పఠన మహాయజ్ఞం ఎంత వేగంగా పూర్తవుతుందా...? అనే తొందర ఆయనలో కనిపిస్తోంది. చూపులు అక్షరాల వెంట పరుగులు తీస్తుంటే... వాటికన్నా వేగంగా పెదవులు రామాయణ మహాకావ్యాన్ని చదువుతున్నాయి. నిముషాల్లో పేజీల వెంట పేజీలు తిప్పుతూ రోజులకు రోజులు నాన్న ఆ పుస్తకాన్ని చదివేస్తున్నాడు. వాల్మీకి సంస్కృతంలో రాసిన రామాయణాన్ని అంత వేగంగా చదువుతుంటే నాన్నలో ఓ రుషి కనిపించేవాడు. సెలవులైపోయి ఊరెళ్లేందుకు పెట్టె సర్దుతుంటే నాన్న దగ్గరికొచ్చి నిలబడ్డాడు. ఓ క్షణం ఏం మాట్లాడలేదు.

"ఏం నాన్నా?" అన్నాను.

"మళ్లీ ఎపుడొస్తావురా?" అడిగాడు నాన్న.

"మళ్లీ లీవ్ దొరగ్గానే వస్తాను నాన్నా..." అన్నాను.

"వేగంగా వస్తావుకదూ..."

ఆమాటకు అక్కడే ఉండిపోవాలనిపించింది.

"నాన్నా... ఇంకా నేను వెళ్లనే లేదు. వెంటనే రమ్మంటే

**ఆయన్ని చూసిన మొదటి క్షణంలోనే - "నాన్నా" అని పిలవాలనిపించింది. అంతేకాదు... ఒక్కసారి ఆయనని తాకాలనీ, చిటికినవేలు పట్టుకుని చిన్ననాటి జ్ఞాపకాలను తడిమి చూసుకోవాలని గుండెలో లోతుల్లోంచి ఆపలేని భావావేశం పొంగుకొచ్చింది.**

ఎలా? వీలైనంత తొందరగా వచ్చి వెడతాను. సరేనా?" అన్నాను.

నాన్నని అపుడే చూడడం. ఆ తర్వాత ఆఖరి చూపు కూడా దక్కలేదు.

కోరాపుట్ నుంచి డిప్యుటేషన్ మీద మరో ఊరికి వెళ్లడంతో నాన్న చనిపోయాడన్న సంగతి ఓరోజు ఆలస్యంగా తెలిసింది. వార్త తెలిసి వెళ్లేసరికే అన్నీ అయిపోయాయి. ఆఖరికి శ్మశానంలో దహనం జరిగినచోట నాన్న గుర్తుగా ఇంత బూడిద వెంట తెచ్చుకున్నాను.

శ్రీరాముడికి దయలేదు కాబోలు. నాన్న కోరిక తీరనే లేదు. మరో పదహారుసార్లు రామాయణ కావ్యాన్ని పఠించాల్సి ఉండగానే ఆయన తనువు చాలించారు. శ్రీరామపట్టాభిషేకం కల నెరవేరకుండా పోయింది.

ఇపుడు రాముడిని చూసినా, రామాయణ కావ్యాన్ని చూసినా నాకు నాన్నే గుర్తొస్తాడు.

రామాలయం పంతులుగారిలో నాన్నగారే కనిపించారు. అంతే ఎత్తు, అదే చామనఛాయ.

సదా కరుణ వర్షించే చల్లని చూపు. ఆత్మీయత పంచే అదే నవ్వు.

ఆయన్ని చూసిన మొదటి క్షణంలోనే - "నాన్నా" అని పిలవాలనిపించింది. అంతేకాదు... ఒక్కసారి ఆయనని తాకాలనీ, చిటికినవేలు పట్టుకుని చిన్ననాటి జ్ఞాపకాలను తడిమి చూసుకోవాలని గుండెలో లోతుల్లోంచి ఆపలేని భావావేశం పొంగుకొచ్చింది. అయితే, ఆయన్నపుడే చూడడం. ఆయన శ్రీరాముడి దర్శనానికి వచ్చిన భక్తులకి ఉద్ధరిణితో తీర్థమిచ్చి, శఠగోపం పెడుతూ రాజేశ్వరిని చూసి పలకరింపుగా చిన్న నవ్వు నవ్వారు.

నేనూ గౌరవ సూచకంగా ఆయనకి నమస్కరించాను. రెండు నిముషాల తర్వాత ఆయనకు తీరికైంది. నాదగ్గరకొచ్చి కూర్చున్నారు.

"ఇవాళ మా నాన్నగారి తిథి. మంత్ర సహితంగానే పితృకార్యం జరిపిద్దామనుకున్నాను. అయితే, ఈ ఊరికి కొత్త..." పరిస్థితి వివరించాను.

"అమ్మాయి అంతా చెప్పింది. స్వయంపాకం ఇచ్చేందుకు వచ్చారుగా" అన్నారాయన.

"అవున"న్నట్లు తలూపాను.


ఆ తర్వాత...


ఇన్ని నువ్వులు నీళ్లతో ధారపోస్తూ తెచ్చిన స్వయంపాకాన్ని అందించాను. ఆయన స్వీకరించారు. తర్వాత, తాంబూలంలో దక్షిణ ఇచ్చి కాళ్లకి నమస్కరించాను. నిజానికి, ఇవాళెంతగానో సంతోషంగా ఉంది. చనిపోయిన తండ్రే స్వయంగా వచ్చి స్వయంపాకం తీసుకున్న దివ్యమైన అనుభూతిని పొందాను. మంత్రంతో బ్రాహ్మలకు భోజనం పెట్టినా ఈ సంతృప్తి లభించేది కాదేమో? తంతు పూర్తయిన తర్వాత... ఆలయంలోనే ఉన్న కుళాయి దగ్గరికి వెళ్లి కాళ్లూచేతులూ ముఖం కడుక్కుని మళ్లీ వచ్చి... శ్రీరామ పాదోదకాన్ని స్వీకరించాను. భక్తుల రద్దీ అంతగా లేకపోవడంతో ఆయన నాపక్కనే వచ్చి కూర్చుని సుందరకాండ చదువుతున్నారు.

"మీరు రామాయణం చదువుతున్నారా?" అడిగాను.

"అవున్నాయనా...? ఆ మహాకావ్యాన్ని నూట పదహారుసార్లు చదవాలని సంకల్పించాను. ఆపై భగవంతుడి దయ..."

రూపమే కాదు, అభిరుచిలోనూ నాన్న పోలికే. నాకెంతో సంతోషం వేసింది. **(మిగతా 27వ పేజీలో)**



(18వ పేజీ తరువాయి)

ఇంకా ఆయనతో మాట్లాడాలనే ఉంది. నా ఉద్దేశాన్ని ఇట్టే గమనించిన రాజేశ్వరి... "పంతులుగారూ... మీరుండేది ఎక్కడా?" కలుపుగోలుగా అడిగింది.

"పక్క వీధిలోనే. ఓ ఇంట్లో అద్దెకుంటున్నా..." చెప్పారాయన.

"అర్చక వృత్తిలో ఆదాయం బాగా ఉంటుందనుకుంటాను..." నేనడిగాను.

"ఏం బాగో? సీతారామస్వామి చల్లగా చూస్తుండబట్టీ కాలం దొర్లిపోతోంది..." గాఢంగా నిట్టూర్చారు. ఆ తర్వాత నా ఉద్యోగం, బాధ్యతలు... ఇలా వివరాలు అడిగారు. ఆయన అలా అడుగుతుంటే ఉద్యోగంలో చేరిన తర్వాత ఇంటికి రాగానే నాన్నగారు ఆత్రుతగా ఆఫీసు విషయాలు అడిగి తెలుసుకున్నరోజు గుర్తొచ్చింది.

పది నిముషాల తర్వాత-

రాజేశ్వరి లేచి- "ఇక, వెడదాం రండి..." అంది.

నాకింకా అక్కడే కాసేపు కూర్చోవాలనిపించినా బాగోదనిపించి నేనూ లేచాను.

అయితే, ఆయన్నొక్కసారైనా ముట్టుకోలేదన్న బాధను నాతోపాటే ఇంటిదాకా వెంట తెచ్చుకున్నాను.

ఆరోజు నుంచీ నా దినచర్యలో కాస్త మార్పొచ్చింది. ఆఫీసునుంచీ త్వరగా ఇంటికి రావడం, సాయంత్రాల్లో తప్పనిసరిగా రామాలయానికి వెళ్లడం అలవాటైంది.

సాన్నిహిత్యం పెరుగుతున్నకొద్దీ పంతులుగారి కుటుంబ విషయాలు తెలుస్తున్నాయి. భార్య ఈమధ్యే పోయింది. ఆడపిల్లలందరికీ పెళ్లిళ్లయి అత్తారిళ్లకెళ్లిపోయారు. అడపాదడపా వచ్చి ఒంటరిగా ఉన్న తండ్రిని పలకరిస్తుంటారు. ఈ అర్చకత్వం మీదనే ఆయన ఆధారపడి బతుకుతున్నారు. వండుకున్నపుడు వండుకోవడం, వండుకోలేనపుడు అరటిపళ్లో, కొబ్బరి ముక్కలో తిని పడుకోవడం చేస్తుంటాడు. వింటుంటేనే బాధనిపించింది.

"ఆఖరి రోజుల్లో అమ్మాయిలదగ్గరే ఉండొచ్చుగా..." ఆ ప్రశ్న అడిగాక నాలిక్కర్చుకున్నాను. కొడుకు దగ్గరే నాన్న ఉండలేదు. పెళ్లిళ్లయి కాపురాలు చేసుకుంటున్న ఆడపిల్లల దగ్గర ఏ తండ్రయినా ఉండగలడా? అమ్మాయిలు మనవాళ్లయినా, అల్లుళ్లు పరాయివాళ్ళేగా.

"ముప్పయ్యేళ్లుగా ఈ రాముడ్నే నమ్ముకున్నాను. నా రాముడు నన్ను ఉపవాసం ఉండనీయడు. గుడి తలుపులు మూసేలోగా నా తిండి నా దగ్గరకొచ్చేస్తుంది. ఆడపిల్లల దగ్గరికెళ్లి ఉన్న స్వేచ్ఛ పోగొట్టుకుని పరాయివాడిలా బతకడం నాకు గిట్టదు." నేనింకేం మాట్లాడలేదు. ఓసారి భోజనానికి ఇంటికి పిలిచినా మృదువుగా తిరస్కరించారాయన. ఉండబట్టలేక పళ్లు తీసుకెళ్లినా తీసుకునేందుకు ఎంతో మొహమాటపడేవారు. అందుకే, ఆయనకోసం ఆలయానికొచ్చి అర్చన చేయించేవాడిని. దక్షిణ ఇచ్చేవాడిని.

"ఈ పూజలన్నీ నాకోసమే కదూ..." నవ్వుతూ అడిగారాయన.

"నాకోసం... నా సంతృప్తికోసం..."

"నీకోసమా?" నావేపు ఆశ్చర్యంగా చూసారు.

"అవును. ఓ విషయం చెప్పనా... మీరు నా తండ్రిలాటివారు. నిజానికి, మీలో మా నాన్న కనిపిస్తున్నారు. మా నాన్న కూడా అచ్చం మీలాగే ఉండేవారు. అందుకే, మీరంటే ఎంతో ఇష్టం. మీకేకష్టం కలక్కూడదని నిత్యం మీరు పూజించే రాముడిని కోరుకుంటున్నాను..." చెప్పాను.

"నా రాముడిచ్చిన కొడుకువి నువ్వే..." ఆ క్షణంలో ఆయన నన్నెంతో ఆత్మీయంగా హృదయానికి హత్తుకున్నారు. మా నాన్నే ప్రేమగా కౌగిలించుకున్న ఫీలింగ్ కలిగింది నాకు. ఆ తర్వాతనుంచీ మా ఇద్దరి నడుమ సంకోచాలు. మోమాటాలు తెగిపోయాయి. సాయంత్రమైతే చాలు, నేనెప్పుడొస్తానా? అని కళ్లింతలు చేసుకుని ఆశగా ఎదురుచూసేవారాయన. ఒకవేళ, ఏదైనా పనిపడి వెళ్లడం ఆలస్యమైతే ఆయన ఆరాటం అంతా ఇంతా కాదు. ఇక, ఓరోజంతా వెళ్లకపోతే ఆయన పడే వేదన చెప్పనలవి కానేకాదు. మా ఇద్దరి మధ్య అనుబంధం అంతలా పెనవేసుకుపోయింది.

ఓరోజు ఆఫీసుకి వెళ్లబోతుంటే... "పంతులుగారికి బాగోలేదం"టూ కోవెలనుంచి కబురొచ్చింది. రాజేశ్వరినీ తీసుకుని... హుటాహుటిన అక్కడికి వెళ్లాను. మొదటిసారి ఆయన ఇల్లు వెతుక్కుంటూ వెళ్లడం. ఇంటి ముందు గుంపులుగుంపులుగా జనాలు.

ముప్పయ్యేళ్లుగా ఈ రాముడ్నే నమ్ముకున్నాను. నా రాముడు నన్ను ఉపవాసం ఉండనీయడు. గుడి తలుపులు మూసేలోగా నా తిండి నా దగ్గరకొచ్చేస్తుంది. ఆడపిల్లల దగ్గరికెళ్లి ఉన్న స్వేచ్ఛ పోగొట్టుకుని పరాయివాడిలా బతకడం నాకు గిట్టదు.

'పంతులుగారికేం కాలేదుకదా!' నా మనసు కీడు శంకిస్తోంది.

జనాలను తప్పించుకుంటూ వెళ్లాను.

వాకిట్లోనే ఎదురైంది ఆయన శవం. ఆ శవం మీద పడి గుండెలవిసేలా ఇద్దరు ఆడవాళ్లు ఏడుస్తున్నారు. వారి పక్కనే ఇద్దరు మగాళ్లు మౌనంగా రోదిస్తున్నారు. వాళ్లు పంతులుగారి కూతుళ్లు, అల్లుళ్లని అర్థమైంది నాకు.

"ఆయనకీలోకంతో రుణం తీరిపోయింది. ఇక, జరగవలసిన తంతు గురించి ఆలోచించండి..." అన్నారెవరో.

"ఊపిరున్నంతకాలమే ఎంతసేపైనా మనమధ్య ఉండేది. ఒక్కసారి ప్రాణంపోయిందా... ఆ కట్టెని కట్టెల్లో కాల్చేదాకా ఒకటే తొందర. శవాన్ని ఒక్కరోజు కూడా అట్టేపెట్టుకోలేంగా..." మరొకరు అంటున్నారు.

"కర్త ఎవరో నిర్ణయించుకుంటే ఎంత త్వరగా ఆ కార్యక్రమం ముగిస్తే అంత మంచిది..." ఇంకొకరి మాట.

"అయ్యగారికి ఇద్దరూ ఆడపిల్లలే. నిప్పుతో అప్పు తీర్చుకునేందుకు ఒక్క కొడుకు కూడా లేడు. ఆడపిల్లలనిచ్చుకున్నాక అల్లుళ్లే కొడుకులవుతారు. కొరివి పెడతారు..."

ఆ మాటనగానే అల్లుళ్లిద్దరి ముఖాలూ మ్లానమైపోయాయి.

పెద్దల్లుడు ముందుకొచ్చి... "నా భార్య గర్భవతి, రేపోమాపో డెలీవరి అనుకుంటుంటే... ఇంతలో, ఇలా ఈ ఘోరం జరిగిపోయింది. భార్య కడుపుతో ఉన్నపుడు ఇలాటి పనుల్లో పాల్గోకూడదని మా ఇంటి పురోహితుడు చెప్పాడు. అదీ సంగతి" కొరివిపెట్టే పని తనది కాదనీ... నిష్కర్షగా చెప్పి, ఆ బాధ్యతనుంచీ తప్పుకున్నాడతడు.

దాంతో, అంతా చిన్నల్లుడివేపు చూసారు.

"మొన్ననే కొత్తిల్లు కట్టుకుని... గృహప్రవేశం చేసి నెల్లాళ్లు కూడా కాలేదు. ఆ ఇంట్లో ప్రతినెలా మాసికం పెట్టడమంటేనే ఆలోచించలేకపోతున్నాను. దయచేసి పెద్దమనసుతో అర్థం చేసుకోవాల్సిందిగా కోరుతున్నాను..." ఖరాఖండిగా అతడూ చెప్పేసాడు.

"అయితే, ఆడబిడ్డలుండి పంతులుగారు అనాథలా పోవాల్సిందేనా?" గుసగుసలాడుకుంటున్నారంతా.

"బతికున్నంతకాలం సమస్యలతోనే సావాసం చేసాను... ఇపుడో నా ప్రాణం పోయింది. ఇక, ఏ సమస్యలూ నన్ను వెంటాడవు..." అంటున్నట్లు నిశ్చింతగా శాశ్వత నిద్రలో ఉన్నారు పంతులుగారు. ఆయన్నలా చూస్తుంటే కన్నీళ్లాగడం లేదు నాకు. స్వామి సేవలో పునీతమైన దేహం ఆయనది. నిత్యం పచ్చని పసుపుతో బియ్యాన్ని కలిపి పవిత్రాక్షింతలు చేసిన చేతులవి. సూర్యుడికంటే ముందుగా లేచి ప్రతిరోజూ తలారా స్నానంచేసి, కోవెలకొచ్చి అర్చన చేసే పంతులుగారాయన.

ఇక, ఆయన కోవెల్లో కనిపించరంటేనే గుండె తట్టుకోలేకపోతోంది. సాయంత్రం వచ్చీరాగానే స్వామివారి పాదోదకాన్ని తీర్థంగా ఇచ్చి, తులసీదళం చేతుల్లో, శఠగోపం తలపై పెట్టి మనస్ఫూర్తిగా ఆయురారోగ్యాలతో నిండునూరేళ్లు చల్లగా ఉండాలని దీవించేవారాయన. ఎవరెవరో ఆయనకు పట్టింపు లేదు. కుల, మత, గుణాలతో ప్రమేయం లేదు. కోవెలకొచ్చిన ప్రతి ఒక్కరినీ ఆశీర్వదించడం ఒక్కటే ఆయనకు తెలుసు. అలాటి భక్తులెవరైనా ఆయన రుణం తీర్చుకోవచ్చు... అవును... ఆయనలో నేనూ తండ్రినే చూసాను. పరిస్థితుల కారణంగా నా తండ్రి తలకు నిప్పు పెట్టలేకపోయాను. ఆఖరి రుణం తీర్చుకోలేకపోయాను. అదే బాధ ఇప్పటికీ నన్ను వెంటాడుతూనే ఉంది. ఇన్నాళ్లకి నాన్న రుణం తీర్చుకునే అవకాశం లభించింది. ఇక్కడి గాలితో, నీటితో, పరిసరాల్తో ఈ పంతులిగారితో రుణముండబట్టే బదిలీ మీద ఈ ఊరొచ్చాను కాబోలు.

ఆలోచిస్తున్నాను.

"ఇంతకీ పంతులుగారికి ఎవరు కొరివి పెడతారో తొందరగా తేల్చుకుంటే మంచిది..." పాడె కడుతున్న వారెవరో గట్టిగా అరిచారు. అల్లుళ్లిద్దరూ ఒకర్నొకరు చూసుకుంటున్నారు భయం భయంగా. ఆడపిల్లలు భర్తల నొప్పించలేని నిస్సహాయతతో లోలోన కృంగిపోతున్నారు.

"అయ్యగారికి కొరివి పెట్టేవారెవరూ లేరా?"

"నేనున్నాను..." అంటూ అడుగు ముందుకేసాను నేను. అంతా నావేపు ఆశ్చర్యంగా చూసారు.

"అవును. ఆఖరి రోజుల్లో పంతులుగారికెంతో దగ్గరయ్యాను. కన్న తండ్రిలా ప్రేమ పంచారాయన. కన్న కొడుకుని కాకపోయినా, కొరివితో ఆయన రుణం తీర్చుకుంటాను..." చెప్పాను. ఆ మాటలంటున్నపుడు రాజేశ్వరి ప్రోత్సహిస్తున్నట్లు నావేపే చూస్తోంది.

"రుణానుబంధ రూపేణా పశుపక్ష్య సుతాలయా..." దూరంనుంచీ ఎవరో అంటున్నది లీలగా వినిపిస్తోంది. నేను పంచె కట్టుకుని స్నానం చేసేందుకు నూతి దగ్గరకి వెళ్ళాను. ★

రచయిత చిరునామా:
పి.వి.డి.ఎస్.ప్రకాష్
12-11-297,
వారాసిగూడ, సికింద్రాబాద్.